నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 MAHABUBNAGAR NARAYANPET



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అంజయ్యయాదవ్

# రెండు నెలల్లో.. కాంగ్రెస్‌పై అసంతృప్తి!

- రేవంత్ దిగజారుడు వ్యాఖ్యలతో ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం
- బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ • ఎంపీ ఎన్నికల్లో మనదే విజయం
- పదేండ్లల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించాం : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బట్టలూడదీసి కొట్టడం ఖాయం : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి
- ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాలి : ఎంపీ మన్నె
- నారాయణపేటలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం
- హాజరైన మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు


మాట్లాడుతున్న ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం


మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి

నారాయణపేట, ఫిబ్రవరి 5 : మరో రెండు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి అసంతృప్తి వస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. పదేండ్ల బీఆర్ఎస్, రెండు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రతిఒక్కరూ ఆత్మ విమర్శ చేసుకుంటున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ తీరుపై రైతులు, పింఛన్‌దారులు ఆలోచనలో పడ్డారన్నారు. 70 ఏండ్లల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితికి రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఇచ్చాం.. కానీ కార్యకర్తలను పట్టించుకోలేకపోయామన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసి మహబూబ్‌నగర్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతున్నదన్నారు.

***ఆత్మ పరిశీలన చేసుకోవాలి : ఎంపీ మన్నె***

రేవంత్‌రెడ్డి మాటలు విడ్డూరంగా ఉన్నాయని, ఆయనకు మతి భ్రమించిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఒకప్పటి, నేటి తెలంగాణకు చాలా తేడా ఉందన్నారు. కేసీఆర్‌ను ఎందుకు వదులుకున్నామనేది తెలంగాణ ప్రజలు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

***బట్టలూడదీసి కొడతరు : రాజేందర్‌రెడ్డి***

ప్రజలు, అన్ని పార్టీల సహకారంతో సాధించుకున్న నారాయణపేట జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ఆలోచనలో ఉన్నదని, ఇదే నిజమని తేలితే ప్రజలు హస్తం పార్టీ నేతల బట్టలూడదీసి కొడుతారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. కొట్లాడి తెచ్చుకున్న జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్, డిగ్రీ కళాశాలలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎంతో అభివృద్ధి చేశామని, ప్రజలకు వివరించడంలో విఫలమయ్యామన్నారు. ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఎంపీ సీట్లు గెలిపించాలని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, రెండునెలలు గడిస్తే కాంగ్రెస్ నాయకులను ప్రజలే తరిమికొడతారన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ దొంగ బుద్ధి ప్రజలకు అర్థమైందన్నారు. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెసోళ్లు కేసీఆర్ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. ఆరు నెలల్లో కేసీఆర్ సీఎం అవుతారని, ప్రతి ఊరిలో గులాబీ జెండా ఎగురుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఆరు గ్యారెంటీలు ఇచ్చే స్తోమత లేదని, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా తీర్పును గౌరవిస్తామని, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, అయినా 1.8 శాతం ఓట్ల తేడాతో ఓడిపోయామన్నారు. సమావేశంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, సాట్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, నియోజకవర్గ ఇన్‌చార్జి దేవరి మల్లప్ప, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య, నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


నారాయణపేట నియోజకవర్గ సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

# విద్యాలయాలు ఏర్పాటు చేయాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- సెంట్రల్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శికి ఎంపీ రాములుతో కలిసి వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 5 : గద్వాల నియోజకవర్గంలో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఎంపీ రాములుతో కలిసి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఢిల్లీలో సెంట్రల్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యదర్శికి పలు విషయాలను వివరించారు. గద్వాల నియోజకవర్గం విద్యాభివృద్ధిలో వెనుకబడి ఉందని, మల్దకల్ మండలంలో కేంద్రీయ విద్యాలయం, కేటీదొడ్డి మండలంలో జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని ఎంపీతో కలిసి కోరారు. అందుకు సెక్రటరీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# రూ.10వేలు దాటిన కందులు

జడ్చర్ల, ఫిబ్రవరి 5: కందుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి, సోమవారం ఏకంగా క్వింటాకు రూ.10వేలు దాటింది. గతేడాది రూ.6 వేల నుంచి రూ.7 వేలు పలికిన కంది ఈసారి రూ.10వేలకు చేరింది. ఈ ఏడాది వానకాలంలో అనుకూలమైన వర్షాలు కురవక పోవడంతో కందిపంటలు దెబ్బతిన్నాయి. దాంతో దిగుబడులు గణనీయంగా తగ్గడంతో కందికి డిమాండ్ పెరిగింది. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం కంది క్వింటాకు గరిష్ఠంగా రూ.10,069, కనిష్ఠంగా రూ.7,083, మధ్యస్తంగా రూ.10,020 ధర పలికింది. వేరుశనగకు గరిష్ఠంగా రూ.7,387, కనిష్ఠంగా రూ.3,514, మధ్యస్తంగా రూ.7,289 ధర పలికింది. అలాగే ఉలువలు క్వింటాకు రూ.7,139, బెబ్బర్లు క్వింటాకు రూ.7,108, జొన్నలు క్వింటాకు రూ.5652, ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.3,115, హంస రకం ధాన్యానికి క్వింటాకు రూ.1,680 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## గట్టు ఎత్తిపోతలకు గండమే..

ఎడారిలా ఉన్న గట్టు ప్రాంతానికి సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం గట్టు ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించింది. గట్టు ఎత్తిపోతల పథకానికి ర్యాలంపాడ్ రిజర్వాయర్ నుంచి నీరు ఇచ్చేలా ఈ పథకం రూపొందించారు. రాయపురం వద్ద 1.3 టీఎంసీల రిజర్వాయర్‌ను నిర్మించి అక్కడ నుంచి గట్టు మండల రైతుల పంట పొలాలకు నీరు అందించడానికి ఏర్పాటు చేశారు. అయితే జూరాల ప్రాజెక్టు మీద నిర్మించిన ప్రాజెక్టులన్నీ వరద, నికర జలాల మీద ఆధారపడి ఉండడంతో వీటి కింద ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారనున్నది. నెట్టెంపాడ్ లిఫ్ట్ గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఏర్పాటు చేసినా 2014 తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పచ్చబడేలా చేసింది. దీంతో నడిగడ్డ ప్రాంతం పచ్చని పైర్లతో కళకళలాడుతున్నది. ప్రస్తుత ముఖ్యమంత్రి తీరుతో నడిగడ్డ మళ్లీ ఎడారిగా మారే అవకాశం ఉన్నది. ఇక్కడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత ప్రభుత్వం కృష్ణానది నీటిలో రాష్ట్రానికి న్యాయమైన నీటి వాటా సాధించే దిశగా ప్రయత్నం చేయడం, తెలంగాణలోని భూములకు సాగునీరు అందించకుండా నదుల అనుసంధానాన్ని అంగీకరించకూడదనే భావనతోపాటు కృష్ణాజలాల నిర్వహణ బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకోవాలనే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతున్నది.


నెట్టెంపాడు ఎత్తిపోతల

# ఎత్తిపోతలు ఉత్తిపోతలేనా..?

ఇక లిఫ్టులకు నీళ్లు కరువే?

### ఉమ్మడి జిల్లాకు కష్టం : ఎమ్మెల్యే బండ్ల



కృష్ణా జలాలను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర జలవనరుల శాఖకు అప్పగించడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాకు అతి పెద్ద కష్టం వచ్చింది. ప్రస్తుతం ఉన్న జూరాల జలాశయం కింద అతి తక్కువ ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రైతుల పక్షాన ఆందోళనలు చేస్తాం.. ఏపీలో కాంగ్రెస్‌ను గెలిపించుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాను ఎడారిగా మార్చబోతున్నాడు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణాజలాల వినియోగాన్ని పెద్ద ఎత్తున పెంచింది. అసంపూర్తిగా ఉన్న నెట్టెంపాడ్, కల్వకుర్తి, రాజీవ్‌భీమా, కోయిల్‌సాగర్ పథకాలను పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించింది. కాంగ్రెస్ నిర్ణయంతో ఈ ఎత్తిపోతల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారబోతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణకు అన్యాయం జరిగింది.

- కేంద్ర జలవనరుల శాఖకు ప్రాజెక్టుల అప్పగింతపై తీవ్ర అభ్యంతరం
- నెట్టెంపాడుకు పంపింగ్ కష్టమే..
- 'గట్టు' లిఫ్టు పనులు ప్రశ్నార్థకమే..
- జూరాల రైతుల పరిస్థితి అధోగతే..
- సాగునీటి రాకపై నీలినీడలు?
- మళ్లీ భూములు నెర్రెలిచ్చే పరిస్థితి
- అయోమయంలో నడిగడ్డ రైతులు

### జూరాల రైతు పరిస్థితి అధోగతే..

జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి వరద వచ్చి చేరుతున్నది. అయితే కృష్ణా ప్రాజెక్టులను కేంద్రం జలవనరుల శాఖకు అప్పగించడంతో జూరాల ప్రాజెక్టు పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఎగువన వరదలు వచ్చినప్పుడు దిగువకు నీరు విడుదలయ్యేది. ఇక్కడికి వచ్చిన నీటిని జూరాలలో స్టోరేజీతోపాటు బ్యాక్‌వాటర్ నుంచి నెట్టెంపాడ్ ఎత్తిపోతలకు తరలించేవారు. కానీ ఇక ఆ పరిస్థితికి అవకాశమే లేదు. వచ్చే ప్రతి నీటి చుక్కకు లెక్క చూపాల్సి రావడంతో నీటిపై హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే జూరాల ప్రాజెక్టులో పూడిక నిండిపోవడంతో ప్రస్తుతం 6 నుంచి 7 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకొనే అవకాశం ఉన్నది. ఎగువ నుంచి నీరు రాకపోతే జూరాల ప్రాజెక్టు ఎండిపోయే ప్రమాదం ఉన్నది. ఈ డ్యాంపై ఆధారపడిన ఆయకట్టుతోపాటు వరద సమయంలో నికర జలాలను వినియోగించుకొనే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది. దీని పరిధిలో ఏర్పాటు చేసిన లిఫ్టులపై ఆ ప్రభావం పడే అవకాశం ఉంది. జూరాల ప్రాజెక్టు కింద కుడి కాల్వ ద్వారా జోగుళాంబ గద్వాల జిల్లాలో 35,657 ఎకరాలకు, ఎడమ ప్రధాన కాల్వ కింద 69,084 ఎకరాల ఆయకట్టు (వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలో) సాగులోకి 2005 సంవత్సరం నుంచి వచ్చింది. ప్రస్తుతం జూరాలలో నీటి లభ్యత లేని కారణంగా యాసంగి పంటలకు విరామం ఇచ్చారు.


నీళ్లు పారకపోవడంతో బోసిపోయి దర్శనమిస్తున్న కాల్వ

గద్వాల, ఫిబ్రవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్ర జలవనరుల శాఖకు అప్పగించడంతో జూరాల, నెట్టెంపాడ్ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనున్నది. జూరాల ప్రాజెక్టు ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరప్రదాయినిగా ఉండగా.. ఇటు జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సాగునీరు అందించడంతోపాటు మిషన్ భగీరథ పథకానికి సైతం ఈ జలాశయం నుంచే నీళ్లు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మన ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్లడంతో ఇటు నడిగడ్డ ప్రజలతోపాటు ఉమ్మడి జిల్లా వాసులకు సాగు, తాగునీటి కష్టాలు ఎదురుకానున్నాయి. మన ప్రాంతానికి చెందిన నేత రేవంత్ సీఎం కావడంతో కష్టాలు తీరుతాయని భావించిన ఉమ్మడి జిల్లా ప్రజలకు కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను దాసోహం చేయడంతో రాజకీయ స్వార్థం కోసం ఈ పనిచేశారని ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పొరపాటుతో జూరాల రైతుల పరిస్థితి అయోమయంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

***నెట్టెంపాడ్ కింద భూములు బీళ్లేనా..?***

జూరాల బ్యాక్ వాటర్ ద్వారా నెట్టెంపాడ్ లిఫ్ట్‌నకు నీటిని తరలించి అక్కడ నుంచి ర్యాలంపాడ్ రిజర్వాయర్‌ను నింపుతారు. దీని ద్వారా 8 మండలాల్లో 104 చెరువులు నింపడంతోపాటు 141 గ్రామాల రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ ప్రాజెక్టు కింద గతంలో కేవలం 20 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించేవారు. 2014లో రాష్ట్రంలో గులాబీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా పనులు పూర్తి చేశారు. జూరాలకు వరద వచ్చిన సమయంలో నీటిని తోడి పోసుకొని ప్రస్తుతం 1.42 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. దీని పరిధిలో 99,100 ప్యాకేజీల పనులు చివరి దశకు పూర్తయితే రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాలను కేంద్ర జలవనరుల శాఖకు అప్పగించడంతో నెట్టెంపాడ్ లిఫ్ట్ మూతపడే అవకాశం లేకపోలేదు. దాని కింద ఆయకట్టు ప్రశ్నార్థకం కానున్నది. నీటిని తీసుకునేందుకు అనుమతి తప్పనిసరి కానుండడంతో నెట్టెంపాడ్ ప్రాజెక్టు కింద ప్రస్తుతం పచ్చని పైర్లతో కళకళలాడే భూములు ఇక నెర్రెలిచ్చి బీడు భూములుగా మారే అవకాశం లేకపోలేదు.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ

# రేవంత్‌పై కన్నెర్ర

- కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు మండిపాటు
- వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- కొత్తకోట, చారకొండలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు


కొత్తకోట, ఫిబ్రవరి 5 : సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని చౌరస్తాలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నేతలు దహనం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ గద్దెనెక్కి రెండు నెలలు కావస్తున్నా ఏ ఒక్క పథకం అమలుకు నోచుకోలేదని దుయ్యబట్టారు. ఫ్రీ సర్వీసుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు తగవు పెట్టారని, దీంతో ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు పోరాటాలు చేయడం వెన్నతో పెట్టిన విద్య అని, గ్రామాల్లోని టీడీపీ, కాంగ్రెస్ నేతలను తరిమికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చంద్రబాబుకు తొత్తుగా ఉన్న రేవంత్‌రెడ్డి ప్రజలను మైమరిపించడానికే కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకోవడంతో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఒకరినొకరు తోసుకున్నారు. నిరసన కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, బాలకృష్ణ, ఆకుల శ్రీను, బాల్‌నారాయణ, అయ్యన్న, పద్మానెహ్రు, కిరణ్, గోవిందునాయుడు, నగేశ్, చింటు, యాదగిరి, తిరుపతయ్య, సంజీవుడు, రాములుయాదవ్, లక్ష్మణ్‌నాయక్, సత్యం, రాజు, రఘువర్ధన్‌రెడ్డి, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.


కొత్తకోటలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు

### అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చారకొండ, ఫిబ్రవరి 5 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అహంకార వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, సీఎం హోదా మరిచిపోయి వీధి రౌడీల్లాగా మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్‌పై విషం కక్కుతున్న సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు చండీశ్వర్‌గౌడ్, జీబీఆర్ యూత్ అధ్యక్షుడు గణేశ్, బీఆర్ఎస్ నాయకులు మహేశ్, బాలయ్య, గంగరాజు, రవి, రమేశ్, మహేందర్, మధు, సాయికుమార్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.


చారకొండలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


వనపర్తిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

### ముఖ్యమంత్రి.. ఖబడ్దార్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి, ఫిబ్రవరి 5 : తెలంగాణ జాతిపిత కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఖబడ్దార్ అంటూ బీఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ హెచ్చరించారు. కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కౌన్సిలర్లు, నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గట్టుయాదవ్ మాట్లాడుతూ 14 ఏండ్లు ఉద్యమం చేసి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడిన కేసీఆర్ గురించి నోటికి ఏది వస్తే అది మాట్లాడితే సహించేది లేదని, తగిన రీతిలో కార్యకర్తలు, ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణ ప్రాజెక్టుల అస్తిత్వాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టి కుటిల నీతిని బయటపెట్టారని విమర్శించారు. రుణమాఫీ, ధాన్యం కొనుగోలుపై బోనస్, రైతుబంధు అమలు చేయకుండా మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు సాగునీరు ప్రయోజనాలను ఢిల్లీకి ధారాదత్తం చేశారన్నారు. గత ప్రభుత్వంలో పట్టాలు అందుకున్న జర్నలిస్టులను వేధిస్తే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదన్నారు. ఆ ప్లాట్లను కొందరు ఉద్దేశపూర్వకంగా రాత్రిపూట చదును చేసి ధ్వంసం చేశారన్నారు. ప్లాట్లు రాని వారికి ఇచ్చేందుకు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రవి, కృష్ణ, నాగన్నయాదవ్, నాయకులు తిరుమల్, రహీం, కృష్ణ, జాత్రునాయక్, గిరి, రాము, జోహెబ్, జహంగీర్, హేమంత్, సంపత్‌కుమార్‌రెడ్డి, రమేశ్, మహేశ్వర్‌రెడ్డి, సుబ్బు, మాధవ్‌రెడ్డి, నీలస్వామి, శ్రీను, ఖాదర్, పాషా, సాధిక్, ఆరీఫ్ పాషా, నాయకులు పాల్గొన్నారు.